వర్ణ - అభేద - సహపంక్తి

[కథానిక]

•

= శ్రీ కవికొండల వెంకటరావు =

సిరియాళరావు డిప్యూటీకలక్టర్ పని చేసి, రిటైర్ అయిన మర్నాడే ఫస్టుక్లాసు బెంచిమేజస్ట్రేటుగా నియమింపబడ్డాడు. నియమింపబడ్డ మర్నాడే కాస్మోపోలిటన్‌క్లబ్బులో మెంబరైనాడు. ఆఫీసర్సు క్లబ్బులో కూడా అయ్యాడని చెప్పుకున్నారుగాని, అసలు ఆఫీసర్సుక్లబ్బు వుందా లేదా అనే సందేహంమీద ప్రజ లామాట విశ్వసించింది లేదు. సిరియాళరావు తాను పింఛన్ తీసికోవడం ప్రారంభించింది లగాయతు "ఏం చేస్తున్నారండీ తమ రిప్పుడు? తమ కిప్పుడంతా విశ్రాంతి అనే అనుకుంటాము" అంటే, జవాబుగా "సాంఘికసేవ", "అఖండ భారత్ సేవ" అని సమాధానం చెప్పేస్తూ వుండేవాడు. మఱీ ఆంతరంగికుల్తో మందహాసంగా ఇలా వివరించేవాడు—"'సాంఘికసేవ' అంటే 'పోకర్' 'రన్‌మార్' 'వెట్‌బ్రిడ్జి' ఆడ్డమేఅనుకోండి. ఎంచేతా అంటే, ఆసునుండి తివ్వీదాకా, మధ్యరాజులున్నా రాణీలున్నా, జాకీలున్నా జోకర్లున్నా ఏకమొత్తంగా గుచ్చెత్తి కలిపేసి, విభేదం పాటించకుండా అక్కడముక్క ఇక్కడకు వచ్చేలాగు, ఇక్కడ ముక్క అక్కడకు వెళ్లేలాగు 'రీషఫల్' చేసి 'డీల్' చేస్తాం. అంతకంటె వర్ణసాంకర్యం, సరిసమానప్పంపకం నాకు మఱెక్కడా కనిపించదు. అందుచేత ఇప్పుడు నేను సాయంకాలం మూడుమొదలు రాత్రి పదిన్నర దాకా పేకాటనిమగ్నుడనై యుంటూవున్నాను. నేనేకాదు, నాతోపాటు మఱి ముగ్గుర్నికూడా అమేషా అదే పనిలో మునిగి తేలేటట్లు చేస్తూవున్నాను. మా టేబిల్ వొక్కటేకాకుండా మమ్మల్నిమించి మఱి ఆరు టేబిల్సు—వారికి కాలపరిమితి కూడా లేదు—క్లబ్బులో వర్కుచేస్తూవుంటాయి. వాళ్ల భోజనభాజనాదు లన్నీ క్లబ్బులోనే. ఇఖ అఖండభారతసేవను గురించి విన్నవించమంటారా?—ఈ అఖండభారత సేవ అనేది నేను క్రాస్‌వర్డు పజిల్సుద్వారా చేస్తూవున్నాను. బ్రాకెట్సుద్వారా గావిస్తూ వున్నాను. ఊరికే మీతో 'అఖండభారత సేవ' అని న్యూనోక్తిగా వచించేనేగాని నా ఆ సేవ న్యూయార్కు పట్నానకుకూడా తగిలి ప్రపంచసేవగా పరిగణింపబడితీరుతుంది. క్రాసువర్డు పజిల్సుసంగతి మీకూ కొంచెమో గొప్పో ఈపాటికి తెలియకుండా వుండదు. మన ఇంగ్లీషుభాష అభివృద్ధిపాం

దుతుంది. మన కంతో ఇంతో 'లక్' వుంటే కిట్టింపూ అవుతుంది. మనకు కిట్టింపు కాక పోయినా మనం కట్టిన సొమ్ము ఒక లక్షమందికైనా భూగోళంమీద వెదజల్లబడకమానదు. మఱి బ్రాకెట్సు సంగతి అదో పెద్ద కిటుకు. ఇంతకూ నాకోరిక— తమ రోనాడు మాయింటికి డిన్నర్‌కు దయచేయాలి"-ఇదీ తంతు, సిరియాళరావుది— తాను డిప్యూటీ కలక్టరు హోదానుంచి విరమించినప్పట్నుంచీని. డిప్యూటీ కలక్టరుగా వున్న న్నాళ్లూ రెండోవిస్తరి ఇంట్లో పడనిచ్చింది లేదు. ఎవరన్నా తనకు తేనీళ్లు పోసి తనకు దండలు వేయాలిసిందేకాని, తా నొక్కళ్లకు కప్పుకాఫీ ఇచ్చి ఒక్క వాడు గులాబీరేకు చేతిలో పెట్టింది లేదు—ఏమనుకున్నారో!

యాత్రైమెదు వెళ్లిన మర్నాట్నుంచీ ఎలా ఫిరాయించిందో అతగాని తత్వం పూర్తిగా ఫిరాయించింది. అయితే పెనిమిటికి తత్వం ఫిరాయించింది కాని భార్యకో? ఆమెలో ఏమీ మార్పు కలగలేదు. ఆవిడఆచారాలేమిటో హరికథలేమిటో, ఉపోష్యాలేమిటో ఉప్పిడిపిండేమిటో, నోములేమిటో నోప్పులుపడ్డాలేమిటో—అదే గొడవ ఆవిడకిప్పటికీని. భర్త రేత్రి పంద్రెండుగంటలకింటికి వచ్చినాగానీ ఆదాకా ఆలా పీట తలగడాగా వాల్చుకొని పడమటింట్లో పండుకొని వుండడమే! పల్లెత్తుమాటనదు! "ఇప్పటి కిల్లూ, నేనూ జ్ఞాపకం వచ్చామా" అని అడిగెరుగదు!!

ఇలా వుంటూవుండగా ఒకనాటి రేత్రి-అర్ధరేత్రి అని వేత్తే వక్కాణించ నవసరం లేదు - వచ్చీవస్తూనే తన అర్ధాంగితో "రేపు రేత్రి మనింట్లో డిన్నర్ ఒకటి ఏర్పాటు చేశాను. మామోలుగా వచ్చేలా ఒకడూ అరా అనుకొనేవుగనుక - పంద్రెండుమందిని పిలిచాను. అందులో ఒకాయన సబుకలకటరు. అంటే తెలుసునా? నేను రిటైరయిన హోదా కంటె పైది ఆయనహోదా! ఆయనమూలంగానే నేను 'బల్లతగవరి' నైంది. తెలుసునా? ఏలా చేస్తావో పదార్థాలు?" అన్నాడు.

భార్య మఱి వోపిక పట్టలేక "ఉద్యోగంలో వున్నన్నాళ్లూ కమాను అని కచ్చేరీ అనీ వెలుపలే వుచ్చారు కాలం అంతా. ఉద్యోగంనుంచి విరమించి పిక్‌నిక్కులూ పేకాట్లూనా? ఇఖిప్పుడు బుద్ధి వచ్చేది మీకు? కృష్ణా రామా అని అనుకొనే దేపూటా? నేను పొట్టువడియమైనా వేయించలేను. నేను వాళ్లందఱికూ ఉప్పరామైనా వడ్డించలేను. మీరు ఎవరిచేతను వండింపించుకొని వడ్డింపించుకుంటారో చేయించుకోండి. ఇంతకూ వాళ్లందఱూ బ్రాహ్మణేతరు లనుకుంటాను. అసలు మీకు బ్రాహ్మణమిత్రులు పనికే రారుగా? అడగడ మెందుకు?" అని చదివింది.

సిరియాళరావు "సబుకలక్టర్ గారు బ్రాహ్మణులేగాని ఆయనక్కూడా నాలాగే అబ్రాహ్మణ సహాపంక్తి అంటే మహాయిష్టం. ఆయన దాన్నే వర్ణ-అభేద-సహాపంక్తి అని మఱోపేర విశదీకరిస్తాడు. ఈ వర్ణ - అభేద-సహాపంక్తి అంటే ఆయనకు మహాయిష్టం. అంచేత పేకాటస్నేహితుల్ని మఱినలుగుర్ని జతచేసి 'డిన్నర్'కు ఆహ్వానించాను. సి

వంటిల్లూ, నీపడమటిల్లూ, నీదేవుడరుగూ, దీపంజ్యోతీ మైలడిపోతాయి అంటే చక్కగా డాబా సావిట్లో విస్తళ్లు వేసి వడ్డించు." అన్నాడు చెక్కుచెదరకుండా.

"అదిగో అక్కడే వుంది మీారంటే నా కోపం! వడ్డించు అంటున్నారు మళ్లీని— ఎవరు వడ్డిస్తారు? అసలు ఎవరు వండుతారు వీళ్లందరికీని? ఉపకారవేతనం అయినప్పట్నుంచీ మాపిన్నినికూడా ఇంట్లో వుణ్ణియ్యకుండా వెళ్లగొట్టేశేరు!" అని వెక్కి వెక్కి యేడ్వసాగింది ఇల్లాలు.

ఆయేడుపు వినకుండానే సిరియాళరావు "మీా పిన్నిముండ ఎక్కడకు వెడుతుంది? దానికీ ఈవూరి సినిమాలోకానికీ ఎడతెగని లంకె. ఇక్కణ్ణే వుండివుంటుంది. కబురెట్టి కనుక్కో రేపురాత్రి మాట దక్కిస్తుందేమో!" అన్నాడు.

భార్య కొంచెం తేటి అంది: "నేనామెను చూచింది మూణ్ణాళ్లక్రితం. మీారు చూచారేమో ఈమధ్య. మీారే కబురెట్టండి! వస్తుంది: రాకేంచేస్తుంది? నాలుగురూపాయలు చేతిలో పెడితే మహాచక్కగా వస్తుంది."

సిరియాళరావు కబురుచేస్తేనే వచ్చిందో, లేక ఆమె స్వయంగా రావాలనే వచ్చిందో, పిన్ని అన్న ఆవిడ తిన్నగా సిరియాళరావుగారి యింటికి మర్నాటి మధ్యాహ్నానకు విచ్చేసింది. అప్పటికప్పుడే కావలసిన సామానంతా-జీలకర్రనుంచి సీంబాదంపప్పువఱకూ తట్టల్తోటీ తబేళాల్తోటీ వచ్చిపడివుంది ఇంట్లో.

సిరియాళరావుభార్యపేరు శ్యామలాంగి తన పిన్నిని చూస్తూనే "వచ్చావుటే పిన్నీ? మాఆయన కబురెట్టారా?" అని అడిగింది. అంటే పిన్ని "మీాఆయనకూ లేదు సిగ్గు-నాకూ లేదు. ఒకడు కబురెట్టేదేమిటే మన యింటికి మనం రావడానికి? మీాయింట్లో ఈరాత్రి 'డిన్నరు'టగా!" అంది. "అదే ఆలోచిస్తున్నాను. వండేవాళ్లు లేరు. వడ్డించేవాళ్లూ లేరు" అంటూ శ్యామలాంగి తన పిన్నియొక్క నుదురుకేసి చూస్తూ ముంగురులకు బదులు ముసుగు అగపిస్తే "ఇదేమిటే పిన్నీ! ఇదెప్పట్నుంచి చేయించావే?" అని అడుగుతూ కంట నీరెట్టుకుంది. పిన్నికూడా అంతో యింతో కన్నీరు విదిపికొని "ఇదేనమ్మా! ఆడదాని అప్రతిష్ఠా అగచాటూను. మొన్నపుష్కరాలకు తీయించేశానే. ఎన్నాళ్లీజుత్తు" అని ముసుగు సర్దుకుంది.

శ్యామలాంగి:– వచ్చేవాళ్లు అందఱూ ఉద్యోగస్థులు. కూర్చునేది వర్ణ-అభేదసహపంక్తిఅన్నారు మావారు.

"అయితే ముసుగువేసుకు వడ్డిస్తే బ్రాహ్మణాచార మైపోతుం దంఛావు!"

"ఉఁ".

"ముసుగు తీసేసికొని వడ్డిస్తేనో?" అని పిన్ని అభినయించింది. ఆ అభినయానకు ముందే "ముసుగు తీసుకువడ్డిస్తే బలే పసందుగా వుంటావులే"అని శ్యామలాంగి విఱగబడి నవ్వింది.

గడియారం ఆవల సాయంకాలం మూడు కొట్టింది. ఇద్దరూకూడా విన్నారు. "నీమర్యాదకు లోపంరాకుండానే వండి నే వడ్డిస్తే సరికదా. వెయ్యిమంది నానాకులాలవాళ్లూ వచ్చి కూర్చున్నా జగన్మోహినిలా వడ్డించగలను నేను. చూతుగాని ఈరేత్రి నావేషం.—నీ మొగుడూ వాళ్లతోటి సరాసరి కూర్చుని భోంచేస్తాడే?" అని బుగ్గను వేలేసుకుంది పిన్ని.

"అందుకనేగా యీ మొఱ్ఱ. వంటింట్లో అయినా, పడమటింట్లో అయినా అయితే నేనే వడ్డిస్తను. డాబాసావిట్లోట సహపంక్తి!"

"ఇంకా ఆచారం అన్నది యీకొంపలో నీమూలంగా నిలబడివుంటూవుంది అనుకో!"

అని పిన్ని చఱచఱా నూతిదగ్గఱకు వెళ్లి స్నానం చేసి, మడిగట్టుకు సాయంకాలం దీపాలవేళకల్లా వంట—సిరియాళరావు పురమాయించిన ప్రకారానికి ఉల్లిరేకక్కూడా తేడా రాకుండా తయారుచేసింది. చేసి "యిప్పుడే వస్తున్నా! చూస్తూవుండు: పదార్థాలు చల్లాఱిపోకుండా, పిల్లి ముట్టుకోకుండా మాఅమ్మా!" అని ఎక్కడికో చక్కాపోయింది.

మళ్లీ వడ్డనప్పుడే పిన్నిని మనం చూడ్డం. ఉడుతతోకకుచ్చువంటి జడచివళ్లు. జడ ఏమో నల్లత్రాచు! ముందుకు ముంగురులు. చెంపల కిందకిందక్కూడా అదేమాదిరి. నున్నని దువ్వు, వెనుపీలీని పువ్వు—ఇలాగ్గా భేషైన సువాసినీరూపం దాల్చింది. చేతుల్ని గాజు లెట్టుకుంది. మెళ్లో హారాలు వేసుకుంది. కాళ్లను ఘల్లుఘల్లుమనే గొలుసు లుంచుకుంది. వొయ్యారిపడుచంటే వొయ్యారిపడుచు అన్నట్టు నడుస్తూ వడ్డిస్తూవుంది.

భోజనానికి కూర్చున్నవాళ్లందఱికీ బలే ఆశ్చర్యంగా వుంది. పదార్థాలుచూస్తే తినాలనివుంది. తినకుండా ఆవిణ్ణి-ఆ వడ్డించేఆవిణ్ణి చూడాలనీవుంది. చివరకు ఆమె వచ్చి, నేతిగిన్నె చేతపట్టి 'కూర్చోండి అయ్యల్లారా!' అని అనేదాకా ఒకళ్ల అరచెయ్యి అన్నం మీద పడలేదు. ఒకప్పడమూ విఱగలేదు. విందుకు వచ్చినవారిలో వొక్కరూ సిరియాళరావును "నీ కేమౌతుందోయి ఈవిడ?" అని అడక్కుండానే ఏదో చూపులకు చూపులంపుకుంటూ భోజనం చేయసాగారు. సిరియాళరావుమాత్రం మధ్యమధ్య మొఖమోటం పడకుండా భోజనంచేయాలిసుమండీ! మీరు మొఖమోటపడ్డారా అంటే మీ యింట్లో డిన్నరుకు నేనూ మొఖమోటపడవలసివస్తుంది" అనేవాడు. "ఇంతకూ పదార్థాల షడ్రుచులు బాగావున్నాయి. వడ్డించేఆవిడ షోడశరుచుల్తో వడ్డిస్తూవుంది - మాకు కొదవేమిటి" అని ఏ అతిథిమట్టుకా అతిథే స్వగతంగా అనుకుంటూ పైకి "సిరియాళరావూ! ఇలాంటి డిన్నర్ మఱొకటి నీవే యివ్వాలోయి! ద్వితీయ విఘ్నం పనికిరాదుసుమా!" అని అభినందించారు. సిరియాళరావు "ఏడిన్నర్ ఆకలి ఆడిన్నరుదే—వేయించుకోండి మఱిరెండు ఒబ్బట్లు" అన్నాడు కొంచెం ఉబ్బి. క్రమేపీ సంతోష సంభాషణ 'మట్టన్'నుంచి మహిషి

దధిదాకా భోజనంతోపాటు జరిగింది. దధిదగ్గఱకు వచ్చేసరికి, ధవళం దధి—మంచి కరడుపెరుగు వడ్డిస్తూవుంది పిన్ని! "ఇంటి గేదా?" అని పంక్తిలో మొదటివాడు అంటే సిరియాళరావు "గేదెల్లో ఇదివఱకు గవిడి గేదెనుగురించి విన్నాను గాని ఇంటిగేదెను గురించి వినలేదు." అంటూ తన అన్నం తాను కలుపుకుంటూవున్నాడు. సబుకలక్టరు హోదామాన్యుడు "అదికాదోయి! గుమ్మం ముందు పితికిస్తున్నావా, పెరట్లో మేపిస్తున్నావా? గేదెను? రెండోరకాంది అయితే ఇంటిగేదె" అన్నాడు. సిరియాళరావు "మన రంగన్న అన్న పూర్వసువాసినీ వ్యాఖ్యానం లాగే వుంది ఇదీని" అన్నాడు. చంద్రన్న అనే పేకాటహీరో అదివఱలో ఆ వ్యాఖ్యానం తాను ధప్పళం కలుపుకోవడంలో వినకనో, లేక కేవలం ఆవిడమీాదనే ధ్యానం వుంచుకునో, ఎఱక్క "ఏమిటి ఆ వ్యాఖ్యానం" అని అడిగాడు. మున్ను విన్న నాగోజీ ఇలా చెప్పేడు గొంతు కూర్చుని త్రేంచుకుంటూ— "ఆవడపూర్వ సువాసినీరూపం గారి. భూలోకంలో ముందు సువాసిని అయి పసుపు పోయి స్త్రీ పూర్వ సువాసిని అవుతుంది. ఈ భోజనలోకంలో ముందు పూర్వసువాసిని అయి గారి అనే పదార్థం తరువాత పసుపుకలిసిన మెంతి పెరుగు తగిలి-తగలడ మేమిటి ? మెంతిపెరుగులో భాగా తడిసి-తడియడమేమిటి నాని-సువాసిని అవుతూవుంది." అన్నాడు.

ఈవ్యాఖ్యానాల దోసందులో, ముక్తాయింపులో పంక్తిలోని కడవానివద్ద ఓ గమ్మత్తు జరిగింది:-పిన్ని జడ ముందుకేసుకు వడ్డిస్తూవుంది! అసలు జడన్నది ఆడవాళ్ల వంటిమీాద ఓచో ఎప్పుడు నిలకడగా వున్నది కనక? ఓపర్యాయం పిరుదుల్ని పింపిళ్లు కూస్తుంది. ఓపర్యాయం ఆబుజాన్ని పడి వెనక్కు మొలను చుట్టేస్తుంది. ఓపర్యాయం ఈబుజాన్నిపడి ముందు మడమలమధ్య పడుతుంది. అందులోనూ ఉడుతతోక కుచ్చు దేమో.వడ్డించే పెరుగుతో కలిసి విస్తట్లో పడింది చటాల్న. అతడు—ఆ విందులోనిద్వాదశార్కుడు "పెరుగులో వెంద్రుక లున్నట్టున్నాయి. ఇది నాన్ వెజిటేరియన్ పెరుగ్గా వుంది." అని ఆ కుచ్చులోని వోవెంద్రుక ఆలా తీసి పారేసినట్టు లాగిపారెయ్యబోయాడు.

దాంతో వడ్డించేఆవిడ 'విగ్' 'విగ్' ఊడి విస్తట్లో పడింది. ఆమె—మన పిన్ని సిగ్గుపడిపోతూ పెరుగుతప్పాలా అక్కడ జారేసి వంటింట్లోకి "వల్లకాటితిళ్లు, వల్లకాటి లోకం" అనుకుంటూ తిరోహిత అయింది. సిరియాళరావూ, తక్కిన ఎలివెన్ నిర్ఘాంత పోసాగారు. పంద్రెండో ఆతడు "పెరుగులోకి వెంద్రుకే కాదు, విగ్ విగ్గే వచ్చిందోయి" అంటూ ఆ విగ్గును సిరియాళరావు విస్తట్లోకి విసిరాడు. సిరియాళరావు "ఎక్స్క్యూజు చెయ్యాలి" అన్నాడు. సబుకలక్టర్ హోదా ఆయన "It is a nice ending—మంచి ముగింపు" అన్నాడు.

ఎంత మంచి ముగింపు అని అన్నా సిరియాళరావు, ఆపూట ఆపంద్రెండుగురూ తానూ మూడుతెగలుగా ఆరేత్రి మూడుగంటల్దాకా ఆడిన పేకాటప్పుడు

కూడా, అంతో యింతో చిన్నబుచ్చుకోక తప్పిందికాదు.

శ్యామలాంగికీ, పిన్నికీ తొలికోడి కొక్కొరోకో అనేదాకా భోజనమే లేదు.

సిరియాళరావు స్నేహితులవద్ద సెలవు తీసుకు వీథితలుపు గెడ వేసికొంటూ, వంటింట్లో ఇంకా చప్పుడౌతూవుంటే వెళ్లి "చూడండి అత్తా! ఇప్పుడు ఉద్యోగస్థుల్లో నూటికి తొంభై మంది వర్ణ అభేదపు తంతుగాళ్లు. ఏం చెయ్యగలం? మనం?" అన్నాడు. శ్యామలాంగి, కిమన్నాస్తి, మాట్లాడలేకపోయింది గాని పిన్ని మాత్రం "విగ్ జాగ్రత్తచేశారా?" అని అడిగింది. అడుగుతూ ఇంకా నిర్వచించింది: "ఈరోజుల విగ్గుల్లో నూటికి తొంభై విగ్గులు వర్ణఅభేదానివే. ఎక్కడో కాని అంతా నల్లగా వున్న విగ్గే కానరాదు బజార్లో. పెరుగులో పడి తెలుపనిపించిందేమోకాని తిరిగి పరిశుభ్రం చేస్తే ఎలా ఉంటుందనుకున్నారు ఈవిగ్! బ్రహ్మాండంగా కాటుకపిట్టలా వుంటుంది." అని సిరియాళరావు చేతిలోంచి ఆ విగ్గున్నూ, విగ్గుతోకూడా ఓ వరహా రొఖ్ఖమున్నూ అందుకుంటూ — "పిల్లా! వెళ్లొస్తా" నంటూ శ్యామలాంగికేసి చిరునవ్వు నవ్వుతూ, పిన్ని వీథిమూలమలుపు తిరిగింది. ఆకాశపు తూరుపు వారగునే అరుణకాంతులు ఆమెపెదవుల్ని ఎదుర్కొన్నాయి!